క్లుప్తంగా

జైగౌడ్ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షునిగా కిషోర్ గౌడ్



తెనాలిటౌన్: జైగౌడ్ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షునిగా పట్టణానికి చెందిన చిట్టి బొమ్మ కిషోర్ గౌడ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శనివారం జగ్గడి గుంటపాలెం గ్రామంలోని గౌడ కాలనీలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో కిషోర్‌గౌడ్‌ను గౌడ సంఘ నాయకులు, ఉద్యమ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కిషోర్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లుగీత కార్మికుల సమస్యలపై గౌడ కులస్థుల ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పోరాటం చేస్తామని చెప్పారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, వాకా అర్జున్, లక్ష్మీ నారాయణ, యేమినేని కోటేశ్వరరావు, సురేంద్ర, వాక ఏసుబాబు, కోటి గౌడ్, అనిల్ గౌడ్, జైగౌడ్ యువత పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పరిశీలన



తెనాలిఅర్బన్: మారీసుపేటలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్‌హెల్త్ సెంటర్ పరిధిలో పంపిణీ చేయకుండా ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను ఆరోగ్యాధికారిణి డాక్టర్ దేవికావాణి శనివారం పరిశీలించారు. వాటిని ఎందుకు పంపిణీ చేయలేదని ఆరా తీశారు. వాటిలో కొందరూ మృతి చెందినట్లు, మరికొందరు వలస వెళ్లినట్లు నిర్ధారణ కావడంతో వాటిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, డీఈవో దాసరి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి: హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) తెనాలి నియోజకవర్గ కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రామలింగేశ్వరపేటలోని కమిటీ హాలులో కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు సమక్షంలో ఈ ఎన్నిక జరిగిందని సాయంత్రం ఆయన ఒక ప్రకటనలో తెలియజేశారు. నియోజకవర్గ కన్వీనర్‌గా నన్నపనేని సునీల్‌కుమార్, సభ్యులుగా ఎం.మణికంఠ, లిఖిత్, శివశ్యామ్, చరణ్, కె.మేఘశ్యామ్, ఆర్.గోపీ కిరణ్‌లను ఎన్నుకున్నారు. వీరికి ధృవీకరణ పత్రాలను నాగరాజు అందజేశారు.

'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సమావేశమైన నాయకులు, కార్యకర్తలు
- టీడీపీ కుటిల రాజకీయాలపై నేతల మండిపాటు



సభకు 'సిద్ధం' అంటూ సంకేతాన్ని చూపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తెనాలి: బాపట్ల జిల్లా మేదరమెట్లలో ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే నాలుగో చివరి సిద్ధం సభకు తెనాలి నియోజకవర్గం నుంచి వేలాదిగా కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలి వెళ్లనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రకటించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో 'అంతా కలిసి సిద్ధం' అంటూ నినాదాలు చేశారు. కార్యకర్తల్లో జోష్‌ను నింపారు. పార్టీ పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాళి శేషాచలం మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా అన్యాయం చేసి విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేస్తున్నారని కేంద్రంలోని అధికార పార్టీని విమర్శించిన ప్రతి పక్ష నేతలు అదే పార్టీతో పొత్తుకు ఎందుకు ఉవ్విళ్లూరుతున్నారని ప్రశ్నించారు. పార్టీ సిద్ధాంతాలను గాలి కొదిలి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై పోరుకు కూటమిలా వస్తున్న నేతల నిజ స్వరూపాన్ని ప్రజలు గమనిస్తున్నారని పోలింగ్ రోజున తమ తీర్పుతో తగిన బుద్ధి చెబుతారని స్పష్టంచేశారు. క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించటానికి సిద్ధం సభకు భారీగా హాజరు కానున్నట్లు చెప్పారు. సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ రాబోయే కాలంలో ప్రజలకు తాము చేయబోయే మేలును ప్రకటిస్తారని తిరుమలశెట్టి శ్రీనివాసరావు వెల్లడించారు. కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, పేరం సంజీవ రెడ్డి, గుంటూరు కోటేశ్వరరావు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వానికి, వైసీపీ ప్రభుత్వానికి గల వ్యత్యాసాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్ మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చని టీడీపీ, ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్న జనసేన పార్టీలు, ఇప్పుడు అలవి కాని హామీలతో మళ్లీ ప్రజల ముందుకు వస్తున్నాయని విమర్శించారు. సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని శ్రీలంక చేస్తున్నారని విమర్శించినవారు ఇప్పుడు అంతకుమించి సంక్షేమం ఇస్తామని చెప్పటం ప్రజలను మరోసారి మోసం చేసేందుకేనని పార్టీ నేతలు స్పష్టం చేశారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు వేలాదిగా మేదరమెట్ల 'సిద్ధం' సభకు హాజరు కావాలని కోరారు. పార్టీ నేతలు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, కాకి దేవ సహాయం, వంపుగళ్ల కృష్ణ, కఠారి హరీష్, ఏలూరి శేషగిరిరావు, షేక్ రహిమా, కోలా వాసు, ఎన్వీ బ్రహ్మం, రావి శ్రీనివాసరావు, మేకల రవి కుమార్, గఫూర్, సయ్యద్ గ్యాస్ సుభాని, టెక్స్ బాల, వీరిశెట్టి భాస్కర్ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- హాఫ్‌పేటలో సచివాలయం, ఆర్‌బీకేలు ప్రారంభం



ఆర్బీకే శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిటౌన్: నియోజకవర్గంలో నాలుగేళ్లలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రెండు వేల జనాభా ఉన్న హాఫ్‌పేటలో రూ.1.17 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో పలు భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రూ.25 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనాలను నిర్మాణం చేశామన్నారు. నాడు–నేడు ఫేజ్–1 కింద రూ.18 లక్షలు, ఫేజ్–2 కింద రూ.12 లక్షలు, గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా వచ్చిన రూ.20 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేపట్టారని దానిలో భాగమే రైతు భరోసా కేంద్రం ఏర్పాటని వివరించారు. రైతులకు విజ్ఞానం అందించాలనేది ఆర్బీకే లక్ష్యమన్నారు. వెల్‌నెస్ సెంటర్‌ల ద్వారా ప్రజలు ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని, ఆరోగ్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణ ఉంటుందన్నారు. సచివాలయం ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. నూతన భవనాలను క్వాలిటీతో నిర్మించామని, సుందరంగా తీర్చదిద్దామని చెప్పారు. ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పనులు చేస్తున్నామని, సీఎం జగన్ చేపట్టిన విప్లవాత్మక మార్పుల వల్ల మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, సర్పంచ్ తలమాల యర్రయ్య, ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరావు, మాజీ ఎంపీటీసీ గోవతోటి సుధాకర్, పార్టీ కన్వీనర్ అబ్రహం, వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్, కొలకలూరి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుబ్బారావు, సూపర్‌వైజర్లు ప్రసన్నలక్ష్మి, వెంకటరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ రేవతి, ఏఎన్ఎం ఉమ, వీఏఏలు నాగరాజు, వంశీ, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, పినపాటి అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తల సేవలు అభినందనీయం

డీఎస్పీ శిరీష

తెనాలిటౌన్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఏడాది ఆలయాల్లో పండుగలు నిర్వహిస్తూ, వృద్ధులకు దుస్తులు అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలను ప్రోత్సహించాలని నెల్లూరు ఏసీబీ డీఎస్పీ పి.శిరీష పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు శివారు ఖాజీపేటలోని శ్రీ కాశీ విశాలాక్షి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా జరిగిన వేడుకల్లో శనివారం డీఎస్పీ పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త రాచర్ల సాంబయ్య పర్యవేక్షణలో జరిగిన సభలో వృద్ధులకు దుస్తులను పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్పీ శిరీష మాట్లాడుతూ గత 18 ఏళ్ల నుంచి శివాలయంలో వేడుకలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను డీఎస్పీ శిరీష, ధర్మకర్త సాంబయ్య, దేవస్థాన కమిటీ సభ్యులు రాచర్ల వెంకట సత్యనారాయణలు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందంజ

తెనాలిఅర్బన్: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోఆపరేటివ్ అండ్ ఫ్రెండ్షిప్ జిల్లా ఉపాధ్యక్షురాలు బెజ్జంకి నాగమణి పేర్కొన్నారు. గాంధీనగర్‌లోని ఇస్కఫ్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీల పట్ల వివక్ష నిర్మూలనకు 1979 డిసెంబర్ 18న ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపిందని గుర్తు చేశారు. వంద దేశాలు ఈ నిబంధనలకు లోబడి ఉండేందుకు అంగీకరించాయని చెప్పారు. నేడు అనేక రంగాల్లో మహిళలు అభివృద్ధి పథంలో పయనించడం శుభ పరిణామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకురాలు శ్రీదేవి, కొర్రపాటి నాగరాజకుమారి, విమల, విజయలక్ష్మి, విజయదుర్గ, అనూష, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



తెనాలిటౌన్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ ఆలయాల్లో శనివారం రథోత్సవం నిర్వహించారు. గంగానమ్మపేటలోని పాత శివాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రమణకుమారి పర్యవేక్షణలో నిర్వహించిన రథోత్సవంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొన్నారు. ఆలయంనుంచి గాంధీచౌక్, మెయిన్ రోడ్డుల మీదుగా పురవీధులలో రథోత్సవం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. బాలాజీరావుపేటలో అయ్యప్ప ఆలయంలో శనివారం ఉదయం రుద్రాభిషేక మహోత్సవం జరిపారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు.

సీఎం జగన్ పాలనకు పట్టం కడదాం



25వ వార్డు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి సాధారణ ఎన్నికలకు సిద్ధమైందని, త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఓటుతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 25వ వార్డు పినపాడులోని శ్రీ కృష్ణుడి గుడి నుంచి శనివారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని వారు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఇస్మాయేల్, గుంటూరు కోటేశ్వరరావు, పేరం సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఇండియా టుడే' చిత్రీకరణ ప్రారంభం



చిత్రంలో ఓ సన్నివేశాన్ని వివరిస్తున్న దిలీప్‌రాజా

తెనాలి: తెనాలికి చెందిన సినీ దర్శకుడు దిలీప్‌రాజా దర్శకత్వంలో రూపొందుతున్న కొత్త సినిమా 'ఇండియా టుడే' చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. కన్నడంలో విలన్ పాత్రల్లో రాణిస్తున్న మర్కాలిపై కోర్టు, జైలు సన్నివేశాలను చిత్రీకరించారు. భారతీయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా నేటి సమాజంలోని విపరీత పోకడలను జల్లెడ వేసి చూపించే ప్రయత్నమే 'ఇండియా టుడే' సినిమాగా దిలీప్‌రాజా చెప్పారు. మన సంప్రదాయాలను మంట కలపొద్దనే సందేశంతో తీస్తున్న పక్కా కమర్షియల్ సినిమా అని తెలిపారు.

శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

చక్రాయపాలెం(కొల్లిపర): మహాశివరాత్రి వేడుకలలో భాగంగా చక్రాయపాలెం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ గంగ పార్వతి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి కల్యాణ మహోత్సవం నేత్రానందంగా సాగింది. ఎమ్మెల్యే శివకుమార్ శనివారం పూజా కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారికిపట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

దైవజనులు ఇమ్మానుయేల్ ఆకస్మిక మృతి

తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌కు చెందిన దైవజనులు రెవరెండ్ ఎస్.ఇమ్మానుయేల్ దాసు (77) శనివారం గుండెపోటుతో స్వగృహంలో మృతి చెందారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వరల్డ్ మిషన్ ఇవాంజలికల్ ఆఫ్ ఇండియా కరస్పాండెంట్‌గా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో పట్టణ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా పనిచేశారు. రెవరెండ్ ఇమ్మానుయేల్ దాస్ మృతి పట్ల పట్టణ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు జాన్‌పాల్ పినపాటి, మాజీ అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, సుధీర్‌కుమార్, రెవరెండ్ ఎ.భానుప్రసాద్, బ్రదర్ ఆనందన్న, పలువురు దైవజనులు, పాస్టర్లు సంతాపం వ్యక్తం చేశారు.